క్లుప్తంగా

వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య వాహనంతో ఎంతో మేలు



గాయాలపాలైన ఆంబోతుకు చికిత్స చేస్తున్న పశు సంచార వాహన సిబ్బంది

పాలకొల్లు సెంట్రల్: వాహనం ఢీ కొట్టడంతో తోక, కాలు భాగంలో గాయాలు కావడంతో నడవలేని స్థితిలో ఉన్న ఓ ఆంబోతుకు ఆదివారం వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య వాహనం ద్వారా మెరుగైన చికిత్సను అందజేశారు. శనివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో తోక భాగం తీవ్రంగా దెబ్బతిని కాలు భాగంలో గాయాలయ్యాయి. దీంతో నడవలేని స్థితిలో ఉన్న ఈ పశువును చూసిన స్థానికులు 1962కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన పశు సంచార ఆరోగ్య వాహన సిబ్బంది శ్రీనువాస్ వచ్చి వైద్య సేవలందించారు. దీంతో స్థానికులు రోడ్లపై పశువులను వదలకుండా అధికారులు కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

స్థానిక కథలకే అగ్రస్థానం



పెనుగొండలో పెనుగొండ కథలు పుస్తకావిష్కరణ చేస్తున్న డాక్టర్ కేఆర్ రాజు

పెనుగొండ: స్థానికత ఆధారంగా వచ్చిన కథలు తెలుగు సాహిత్యంలో సుస్థిర స్థానంగా నిలిచాయని, మూర్తి రచించిన 'మా పెనుగొండ కథలు' సైతం మన్ననలు పొందుతాయని పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల పాలకవర్గ సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కే రామచంద్రరాజు అన్నారు. ఎంఆర్వీ సత్యనారాయణ మూర్తి రచించిన మా పెనుగొండ కథలు పుస్తకావిష్కరణ చేసారు. కార్యక్రమంలో త్యాగరాజ గాన సభ అధ్యక్షురాలు డాక్టర్ కే అన్నపూర్ణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కేవీఆర్ సూర్యనారాయణ, రమ్య సాహితీ కార్యదర్శి ఎం.రాజేశ్వరి, ఎం.సుగుణాకర్, టి సూర్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

పాలకొల్లు అర్బన్: మండలంలోని చింతపర్రులో ఆదివారం తెల్లవారు జామున కోడిపందేలు ఆడుతున్నారనే సమాచారం మేరకు పాలకొల్లు రూరల్ పోలీసులు దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి ఒక కోడిపుంజు, ఒక కోడికత్తి, రూ.5 వేల నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై కె.శ్రీనివాసరావు తెలిపారు.

ఉండిలో..

ఉండి: మండలంలోని చెరుకువాడ గ్రామంలోని అలుగులమ్మ గుడి వద్ద ఆదివారం నిర్వహిస్తున్న కోడిపందేలపై ఎస్సై కె.గంగాధరరావు ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 26 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.6200 నగదు, 4 కోళ్ళు, 2 కోడికత్తులు, 18 మోటార్‌సైకిళ్ళు స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పేకాడుతున్న ఎనిమిది మంది అరెస్ట్

పాలకోడేరు: ఓ ఇంట్లో పేకాడుతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ఎనిమిది మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని వేండ్ర గ్రామంలో చింతపల్లి వారి వీధిలో కేతా శ్రీను ఇంట్లో పేకాడుతుండగా ఎస్సై సీహెచ్ఎస్ రామచంద్రరావు తన సిబ్బందితో దాడి చేసి 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 19,350 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిని సోమవారం భీమవరం కోర్టులో హాజరు పరుస్తామని ఎస్సై సిహెచ్ఎస్ రామచంద్రరావు తెలిపారు.

విద్యార్థులకు తోడుగా విజ్ఞానం

- ప్రభుత్వ పాఠశాలల్లో ట్యాబ్‌ల అందజేత
- చాలా ఉపయోగపడతాయంటున్న విద్యార్థులు



దిగమర్రు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లతో విద్యార్థులు

పాలకొల్లు అర్బన్: ఆధునిక విజ్ఞానం విద్యార్థికి అందుబాటులోకి వచ్చింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్ర వ్యాప్తంగా 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. దీంతో విద్యార్థుల ఆనందం అవదులు దాటింది. విద్యార్థులతో పాటు, 8వ తరగతి పాఠ్యాంశాలు బోధించే ఉపాధ్యాయులకు కూడా ట్యాబ్‌లను ప్రభుత్వం అందజేసింది. బైజూస్ సంస్థ ఆధ్వర్యంలో 8వ తరగతి ఇంగ్లిషు, లెక్కలు, సోషల్, ఫిజికల్ సైన్స్, నేచురల్ సైన్స్‌ల పాఠాలను ట్యాబ్‌లో పొందుపరిచారు. ఈ ట్యాబ్‌లు విద్యార్థి వద్దే ఉండడం వల్ల స్కూల్ సమయంతో పాటు, స్కూలేతర సమయంలో కూడా విద్యార్థి చదువుకోవడానికి, అనుమానాలు నివృత్తి చేసుకోవడానికి, అదనపు సమాచారం తెలుసుకోవడానికి ఈ ట్యాబ్‌లు బాగా ఉపయోగపడతాయని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ట్యాబ్‌లు అందజేయడం వలన రానున్న తరగతుల్లో కూడా మంచి మార్కులు సాధించడానికి వీలు కలుగుతుందని విద్యార్థులు అభిప్రాయపడుతున్నారు.

అనుమానాల నివృత్తి

కొంతమంది విద్యార్థులు ఆయా పాఠ్యాంశాల్లో వచ్చిన అనుమానాలు నివృత్తి చేసుకోవడానికి ఉపాధ్యాయుడు అవసరం లేకుండా ట్యాబ్‌లో ఉన్న సమాచారం ఆధారంగా పాఠాన్ని సులభతరంగా అర్థం చేసుకోవచ్చంటున్నారు. కొన్ని అంశాలు చిత్రీకరణ ద్వారా దృశ్య రూపంలో చూపిస్తే స్పష్టమైన భావన విద్యార్థికి ఏర్పడుతుంది. దీంతో ఆయా పాఠ్యాంశాల్లో పట్టు సాధిస్తారు. పై తరగతుల్లో పాఠ్యాంశాల్లో సులభతరంగా పాఠాలు అర్థమవుతాయి. ఉపాధ్యాయుడు సమయాభావంతో కొన్ని పాఠ్యాంశాలు విపులంగా చెప్పలేని సమయంలో ఈ ట్యాబ్‌లో పొందుపరిచిన అంశాలను విద్యార్థి స్వయంగా చదువుకోవడానికి అవకాశం కలుగుతుంది. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించడంపై ప్రజలంతా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

పాలకొల్లు నియోజకవర్గంలో అందించిన ట్యాబ్‌లు

మండలం	ఎనిమిదో తరగతి విద్యార్థులు	అందించిన ట్యాబ్‌లు
పాలకొల్లు	616	616
పాలకొల్లు పట్టణం	465	465
పోడూరు	310	310
యలమంచిలి	659	659

పాఠ్యాంశాలు అర్థం చేసుకోవచ్చు



మాకు ట్యాబ్‌లు అందించడం వల్ల పాఠ్యాంశాలు సులభంగా అర్థం చేసుకోవచ్చు. అనుమానాలను సైతం నేనే స్వయంగా నివృత్తి చేసుకునే వెసులబాటు ఉంది. ఆధునిక సాంకేతిక విజ్ఞానం అందించిన సీఎం జగన్ సార్‌కి రుణపడి ఉంటా.

– కుక్కల చంద్ర శ్రీవల్లి,

పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య



పేద విద్యార్థులకు ప్రభుత్వం కార్పొరేట్ విద్యను అందిస్తుంది. ఈ విధానం వల్ల విజ్ఞానపరంగా అభివృద్ధి సాధిస్తానని అనుకుంటున్నా. నేను ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని బాగా చదువుకుంటాను.

– చింతా యామినీ లక్ష్మి హర్షిత

మాలవానితిప్పలో ప్రత్యేక హోమాలు



మాలవానితిప్పలో అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: కొత్త ఏడాదిలో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆయురారోగ్యాలతో ఉండాలని సంకల్పిస్తూ మాలవానితిప్ప గ్రామంలో ఆదివారం ప్రత్యేక హోమాలు నిర్వహించారు. మాలవానితిప్ప గ్రామంలో కొలువైన శ్రీ అభయాంజనేయ స్వామి మందిరం వద్ద గ్రామ సర్పంచ్ సాగిరాజు సుబ్బరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు జరిపించారు. వేదమంత్రాలు నడుమ ప్రధాన అర్చకులతో హోమాలు కార్యక్రమాలు ఎంతో వైభవంగా చేశారు.

రాష్ట్ర కార్మిక చైతన్య యాత్ర జాతరకు స్వాగతం

తాడేపల్లిగూడెం (టీఓసీ): భీమవరంలో నిర్వహించనున్న సీఐటీయూ 16వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ రాష్ట్ర కార్మిక చైతన్య యాత్ర జాత ఇచ్ఛాపురంలో డిసెంబర్ 28న ప్రారంభం కాగా చైతన్య యాత్ర జాత ఆదివారం తాడేపల్లిగూడెం పట్టణానికి చేరుకుంది. ఈ యాత్రకు సీఐటీయూ పట్టణ నాయకులు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ నరసింగరావు, ఉపాధ్యక్షురాలు బేబీ రాణిలు మాట్లాడారు. కర్రి నాగేశ్వరరావు, కరెడ్ల రామకృష్ణ, ఎన్.రమణారావు, జవ్వాది శ్రీను, చిటికిన రాము, పైడియ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బీవోసీ నిధులను కార్మిక సంక్షేమానికి వెచ్చించాలి

తాడేపల్లిగూడెం రూరల్: కార్మికుల సంక్షేమానికి బీవోసీ బోర్డు నిధులను వెచ్చించాలని ఇఫ్టూ జిల్లా నాయకుడు మామిడి దానవరప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని జగన్నాథపురంలో ప్రగతిశీల భవన నిర్మాణకార్మిక సంఘం (ఇఫ్టూ) జనరల్‌బాడీ సమావేశం తులా దుర్గారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మామిడి దానవరప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి ఏడు నెలల నుంచి ఏ విధమైన గృహ రుణాలు ఇవ్వకపోవడంతో భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక అర్ధాకలితో జీవిస్తున్నారని, తక్షణమే ప్రభుత్వం ఇచ్చే ఇళ్లకు రుణం వెంటనే మంజూరు చేయాలని, బిల్డింగ్ మెటీరియల్ రేట్లు తగ్గించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని, 60 ఏళ్లు దాటిన భవన నిర్మాణ కార్మికులకు బీవోసీ కార్డులు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఎం.సత్తిపండు, నీలం సత్తిబాబు, టి.సురేష్, తోట సూర్యనారాయణ, నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, ధనరాజు, రాంబాబు, కృష్ణ, నవీన్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



నరసాపురంలో పింఛన్‌లు పంపిణీ చేస్తున్న చీఫ్‌విప్ ముదునూరి



జగన్నాథపురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న నాయకులు



కొమ్ముచిక్కాలలో వృద్ధులకు పింఛను సొమ్ము అందిస్తున్న దృశ్యం

నరసాపురం: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా పనిచేస్తుందని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. నూతన సంవత్సరంలో ప్రభుత్వం పింఛన్ మొత్తాన్ని రూ.2500 నుంచి రూ.2750కు పెంచిన సంగతి తెలిసిందే. ఆదివారం వేకువ జామునే పెంచిన పింఛన్ మొత్తాలను లబ్ధిదారులకు అందించారు. పట్టణంలోని 11,12 వార్డుల్లో ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్‌లు అందించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ హయాంలో గతంలో పింఛన్ తీసుకుంటున్న వారిలో ఎవరో ఒకరు చనిపోతే కానీ కొత్తవారికి పింఛన్ ఇచ్చే పరిస్థితి ఉండేదికాదని గుర్తు చేశారు. ప్రభుత్వంపై ఎంత ఆర్థికభారం పడుతున్నా కూడా లెక్కచేయకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముందుకు వెళుతున్నారని చెప్పారు.

90 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి

మొగల్తూరు: పాత పింఛన్లతో పాటు కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమం 90 శాతం పూర్తయ్యిందని ఎంపీడీఓ ఆర్‌సీఆనంద్ కుమార్ తెలిపారు. ఇప్పటివరకు వితంతు, వికలాంగ, వృద్ధాప్య, తదితర పింఛన్‌లు 10,600 మందికి అందిస్తుండగా మండలంలోని 17 గ్రామాలకు సంబంధించి నూతనంగా 257 పింఛన్‌లు మంజూరయ్యాయి. ఆదివారం వేకువ జాము నుంచే ఆయా గ్రామాల్లో జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ తదితరులు పింఛన్లు అందించారు.

పెనుగొండలో..

పెనుగొండ: గ్రామంలో ఆదివారం మాజీ మంత్రి తనయుడు, యోగా అసోషియేషన్ అధ్యక్షుడు చెరుకువాడ నరసింహరాజు(నరేష్) కొత్తగా మంజూరైన పింఛన్లను ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు, వలంటీర్లతో కలిసి అందించారు. ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా ఎటువంటి పైరవీలు లేకుండా సంక్షేమాన్ని అమలు చేస్తుందన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరావు(పెద్ద), వైఎస్సార్ సీపీ నాయకులు పోడూరి రామయ్య, నేలపూడి లక్ష్మణరావు, మేడపాటి వీర్రెడ్డి, తిక్కిరెడ్డి పవన్ కుమార్, సుంకర నాగబాబు, వెలగల శ్రీనివాసరెడ్డి, బాలం సత్తిరాజు, గుడాల దుర్గారావు, బుచ్చిబాబు పాల్గొన్నారు.

నరసాపురంలో..

నరసాపురం రూరల్: మండలంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలతోపాటు పింఛన్ల పంపిణీ కూడా పం పండుగలా నిర్వహించారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా వేకువ జాము నుంచే పెరిగిన పింఛన్ల మొత్తాలతో పాటు, కొత్తగా మంజూరైన పింఛన్లను కూడా పంపిణీ చేశారు. మండలంలో ఇప్పటి వరకూ 10,841మందికి పింఛన్లు ఇస్తుండగా నేటి నుంచి 368 మందికి వివిధ రకాల పింఛన్లను కొత్తగా మంజూరు చేశారు. దీంతో గతంలో ప్రతీ నెలా 2.71 కోట్లు అయ్యే పింఛన్ ఖర్చు ఈ నెల 3.15 కోట్లుకు పెరిగింది.

కొమ్ముచిక్కాలలో..

పోడూరు: పింఛన్ సొమ్ము రూ.2750కు పెంచడంతో వృద్ధులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారని జెడ్పీ ఫ్లోర్ లీడర్ గుంటూరి పెద్దిరాజు అన్నారు. కొమ్ముచిక్కాల గ్రామంలో ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని లబ్ధిదారులకు పింఛను సొమ్ము పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గుంటూరి చంటిరాజు, బుడితి సుబ్బారావు, సచివాలయ సారధులు నాగరాజు బాలాజీవర్మ, తానేటి సురేష్, పిల్లి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



నరసాపురంలో చీఫ్‌విప్ ప్రసాదరాజుకు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు



పెనుగొండ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

నరసాపురం: నూతన సంవత్సరం ప్రజల అందరి జీవితాల్లో సంతోషాలు నింపాలని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ఆదివారం పట్టణంలోని గోదావరి రేవు వద్ద ఉన్న ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి నివాసంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ఉదయమే ముదునూరి కట్ చేశారు. నియోజకవర్గం నలు మూలల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ముదునూరి నివాసానికి చేరుకుని నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు.

పెనుగొండలో..

పెనుగొండ: చంట నియోజకవర్గ పరిధిలో నూతన సంవత్సర వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. పెనుగొండ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో మాజీ మంత్రి తనయుడు, యోగా అసోషియేషన్ అధ్యక్షుడు చెరుకువాడ నరసింహరాజు(నరేష్), పెనుగొండ, పెనుమంట్ర ఎంపీపీలు పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), కేఎస్ నారాయణ రెడ్డి(వాసు) తదితరులు పాల్గొన్నారు.

తూర్పుపాలెంలో

తూర్పుపాలెంలోని మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆచంట, ఉంగుటూరు నియోజకవర్గాల నుంచి వచ్చిన వైఎస్సార్ సీపీ నాయకులు కేక్ కట్ చేసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఆచంట మండలంలో

నూతన సంవత్సర వేడుకలను ఆచంట మండలంలో ఆయా గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆచంట, కొడమంచిలి , ఎ.వేమవరం ,వల్లూరు పెనుమంచిలిలలో ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, గ్రామాల సర్పంచ్‌లు కోట సరోజని, సుంకర సీతారామ్, జక్కంశెట్టి చంటి, గణేషుల శేషవేణి సుబ్బారావులు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో కేక్ కట్ చేసి అందరికీ కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అందరూ సుఖ శాంతులతో వర్ధిల్లాలని వారు ఆకాంక్షించారు. ఆచంటలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్‌ల, మాల మహానాడు కార్యాలయంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజులు కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలలో పాల్గొన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా యువతులు వీధులన్నీ రంగు రంగుల ముగ్గులతో నింపేసి కొత్త సంవత్సరానికి స్వాగతం, పాత సంవత్సరానికి వీడ్కోలు పలికారు.

కొడమంచిలి సొసైటీ క్యాలెండర్ ఆవిష్కరణ

పెనుగొండ: కొడమంచిలి వ్యవసాయ సహకార పరపతి సంఘ క్యాలెండర్‌ను మాజీ మంత్రి తనయుడు, యోగా అసోషియేషన్ అధ్యక్షుడు చెరుకువాడ నరసింహరాజు ఆవిష్కరించారు. ఆదివారం తూర్పుపాలెంలో జరిగిన కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కాండ్రేగుల సత్యనారాయణతో కలసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆచంట, పెనుగొండ మండలసర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారాం, దండు పద్మవతి, సర్పంచ్ జక్కంశెట్టి చంటి, పోతుమూడి రామచంద్రరావు, పులిదిండి వెంకటేశ్వరరావు, మర్రే ప్రసాద్, పోలిశెట్టి వనమరాజులు పాల్గొన్నారు.

యలమంచిలో..

యలమంచిలి: మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఆదివారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో ఎంపీపీ రావూరి వెంకట రమణ, వెంకట కోటి మురళీకృష్ణ దంపతులను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు.

అమ్మవార్ల జాతరలు ప్రారంభం

పెంటపాడు: నూతన సంవత్సరం పురస్కరించుకొని నియోజకవర్గంలో సందడి నెలకొంది. దర్శిపర్రు గ్రామ దేవత పుంతలో ముసలమ్మ ఆలయం వద్ద 5 రోజులపాటు నిర్వహించనున్న జాతరను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. బంధువుల హడావుడి నెలకొంది. జాతర ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు.

గ్రామాల్లో అమ్మవారి ఆలయాల వద్ద పూజలు

ఆకుతీగపాడులో గ్రామ దేవత ముత్యాలమ్మ ఉత్సవాలకు సంబంధించి ప్రత్యేక పూజలు చేసారు. ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. కోరిమిల్లిలో గ్రామ దేవత



దర్శిపర్రులో పూజలందుకుంటున్న పుంతలో ముసలమ్మ వారు

కట్లమ్మ అమ్మవారు, రావిపాడులో వెంకయ్యకాలువ గట్టున వేంచేసియున్న ముళ్లమ్మ అమ్మవార్ల ఆలయాలను ఉత్సవాలకు ముస్తాబు చేసారు. అలంపురంలో రజకచెరువు వద్ద ముళ్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసారు. జట్లపాలెం పారుపల్లి అమ్మవారు, పెంటపాడులో గ్రామదేవతలైన పెంట్లమ్మ అమ్మవారు, పుంతలోముసలమ్మ అమ్మవారి ఆలయం, ముత్యాలమ్మ అమ్మవారి ఆలయాల వద్ద ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పలువురికి అభినందన

నూతన సంవత్సరం పురస్కరించుకొని మండలంలో పలువురు గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులకు కార్యకర్తలు, గ్రామ ప్రజలు శుభాకాంక్షలు తెలుపుతూ సన్మానాలు చేసారు. జట్లపాలెంలో పార్టీ బీసీ సంఘ నాయకులు కట్టుబోయిన కృష్ణప్రసాద్, ఆకుతీగపాడులో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, ప్రత్తిపాడులో పార్టీ సీనియర్ నాయకులు వీర్ల గోవింద్, కోరిమిల్లిలో మాజీ సర్పంచ్ వల్లూరి బ్రహ్మానందం, మీనవిల్లూరులో సర్పంచ్ దంపతులు చింతపల్లి లక్ష్మి, శ్రీనివాసరావు, పెంటపాడులో పార్టీ జిల్లా కార్యదర్శి నల్లమిల్లి విజయానందరెడ్డి, సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, ఉపసర్పంచ్ కొవ్వూరి భాస్కరరెడ్డి తదితరులను ఆయా గ్రామాల ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు.

పుంతలో ముసలమ్మ ఆలయంలో విశేష పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని సీతారాంపేట-కొబ్బరితోటలో వేంచేసియున్న పుంతలో ముసలమ్మ తల్లి 40వ వార్షిక మహోత్సవాలు సందర్భంగా యువఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నుంచి అమ్మవారికి విశేష పూజలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మహిళలు, భక్తులు లలితా సహస్ర పారాయణం నిర్వహించారు. ఉత్సవ కమిటీ గౌరవాధ్యక్షుడు రాజా త్రినాథ్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈతకోట తాతాజీ, నరిసే సోమేశ్వరరావు, అయినం బాలకృష్ణ, ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.